సాక్షి వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 26 । జనవరి । 2023



వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శం

వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శమని వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. -8లో..



రైలుపట్టాలపై క్లిప్పల తొలగింపు

రైలు పట్టాలకు ఉన్న క్లిప్పలను గుర్తు తెలియని దుండగులు తొలగించి పక్కన పడేశారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.2/16.9

జిల్లాలో బుధవారం 16.9 – 30.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

మెనూ మారింది.. రుచి అదిరింది

- మారిన మధ్యాహ్న భోజన మెనూ
- ఈ నెల 12 నుంచి కొత్త మెనూ అమలు
- ఇటీవలే పెరిగిన మధ్యాహ్న ఏజెన్సీల బిల్లులు
- నెలలో నాలుగుసార్లు గుడ్లు సరఫరా
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

జిల్లాలో మధ్యాహ్న భోజనం అమలవుతున్న పాఠశాలల వివరాలు..

పాఠశాలల కేటగిరి	మొత్తం పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1621	77,357
ప్రాథమికోన్నత	171	43,611
హైస్కూల్స్	256	27,836
మొత్తం	2,048	1,48,804



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పేరుతో పోషక విలువలతో కూడిన భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులో కూడా రాణిస్తారనే ఉద్దేశంతో రోజుకో మెనూతో విద్యార్థులకు గోరుముద్దను అమలు చేస్తోంది. ఈ కొత్త మెనూను ఈ నెల 12 నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. గతంకంటే రెట్టింపు ఉత్సాహంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తింటున్నారు. .

ఇటీవలే వంట ఏజెన్సీలకు కూడా ప్రభుత్వం బిల్లులు పెంచింది. దీంతో విద్యా ర్థులతోపాటు ఏజెన్సీల నిర్వాహకులు కూడా ఉత్సా హంగా ఉన్నారు. అలాగే గతంలో నెలకు మూడు సార్లు కోడిగుడ్లను సరఫరా చేసేవారు. దీంతో కొన్ని చోట్ల గుడ్లు చెడిపోయేవి. ఫలితంగా విద్యార్థులు తినేందుకు ఇబ్బందులు పడే వారు. దానిని కూడా గమనించిన ప్రభుత్వం వాటికి చెక్ పెడుతూ నెలకు నాలుగు సార్లు గుడ్ల సరఫరాకు చర్యలు తీసుకుంది. దీంతోపాటు ఏ వారంలో ఏ రంగు ఉన్న గుడ్లను వాడాలో కూడా గుడ్లపై స్టాంప్‌ను ముద్రించి సరఫరా చేస్తున్నారు.

2,048 పాఠశాలల్లో..

జిల్లాలోని 2,048 పాఠశాలల్లో 1,48,804 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. అందులో 1621 ప్రాథమిక పాఠశాలల్లో 77,357 మంది, 171 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 43,611 మంది, 256 ఉన్నత పాఠశాలల్లో 27,836 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి రూ. 5.45, ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. రూ.8.17 ఇస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెనూ వివరాలు ఇలా...

రోజు	కొత్త మెనూ
సోమవారం	హాట్ పొంగల్, బాయిల్డ్ ఎగ్, వెజ్ పలావ్, గుడ్డుకర్రి, చిక్కీ
మంగళవారం	చింతపండు పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన కోడిగుడ్డు
బుధవారం	కూరగాయల అన్నం, ఉల్లగడ్డ కుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
గురువారం	సాంబారు అన్నం, నిమ్మకాయ పులిహోర, టమాట చట్నీ, ఉడికించిన గుడ్డు
శుక్రవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
శనివారం	ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి

విద్యార్థుల రుచులకు అనుగుణంగా..

జగనన్న గోరుముద్దలో భాగంగా మధ్యాహ్న భోజనం పథకంపై పిల్లల నుంచి ఎప్పటికప్పుడు విద్యాశాఖ అభిప్రాయాలు సేకరిస్తోంది. విద్యార్థుల రుచులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మెనూను మారుస్తున్నారు. సాంబర్‌బాత్‌ను ఈ ప్రాంత విద్యార్థులు సరిగా తినడం లేదని తెలిసి దాని స్థానంలో నిమ్మకాయ పులిహోర(చిత్రాన్నం) చేర్చారు.

వారంలో 5 రోజులు కోడిగుడ్లు: విద్యార్థులకు కోడిగుడ్డును వారంలో ఐదు రోజులు అందిస్తున్నారు. తాజా మార్గదర్శకాల ప్రకారం నెలలో సరఫరా చేసే గుడ్డుపై వారానికో రంగుతో గుడ్డుపై స్టాంపింగ్ చేస్తున్నారు. మొదటివారం నీలం, రెండవవారం గులాబీ, మూడవ వారం ఆకుపచ్చ, నాలుగోవారం వంగపూత రంగులో స్టాంపింగ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. నెలలో ఏవారం సరఫరా అయిన గుడ్లు అదే వారంలోనే వినియోగించాలి. ఒక వేళ పాఠశాల పనిదినాల్లో సెలవులు వచ్చినా లేదా ఇతర కారణాలతో గుడ్లు మిగిలినా వాటిని తర్వాత వారంలో వినియోగించరాదు.

రుచిగా ఉంటుంది



మధ్యాహ్న భోజనం చాలా రుచిగా ఉంటుంది. వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు ఇస్తారు. రోజు ఒక కూరతో పాటు కోడిగుడ్డు కూడా ఉంటుంది. కనుక అన్నం బాగా తింటున్నాం.

– ఉజ్వల, 10వ తరగతి విద్యార్థి

రోజూ తింటున్నాం



గతంలో మధ్యాహ్న భోజనం సరిగా తినే వాళ్లం కాదు. ఇప్పుడు చాలా బాగా ఉంటోంది. రోజు కచ్చితంగా భోజనాన్ని తింటున్నాము. రోజూ ఒక మెనూను పెడతారు. దాంతోపాటు రుచిగా కూడా ఉంటుంది.

– నవనీత్, 10వ తరగతి విద్యార్థి

12 నుంచి కొత్త మెనూ



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్దకు సంబంధించిన కొత్త మెనూను ప్రకటించింది. ఈ మెనూను ఈ నెల 12వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. పిల్లలకు అవసరమైన పోషక విలువలు అందించే విధంగా గోరుముద్ద మెనూ అమలుకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు పోషకాలు కలిగిన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంగా జగనన్న గోరుముద్ద అమలు చేస్తున్నాం.

– చెప్పలి దేవరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి

రామ సేవలో హనుమ



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న శ్రీ లక్ష్మివెంకటేశ్వరస్వామి

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి ఉదయం కల్పవృక్ష వాహనంపై విష్ణుమూర్తిగా కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం హనుమంత వాహనంపై కోదండరాముడిగా కొలువుదీరాడు. వేద పండితులు స్వామి అమ్మవార్ల మూల విరాట్లకు విశేష అలంకారం చేశారు. అమ్మవారి సన్నిధిలో గానం, సంగీతం నివేదిస్తూ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయం వెలుపలగల అలంకార మండపంలో స్వామిని వాహనంపై ఆసీనులను చేశారు. సూర్యతేజోమయుడైన శ్రీ రామచంద్రుడు ధగధగలాడే రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో మరింతగా మెరిసిపోతూ భక్తులను కరుణించాడు. మాడ వీధుల్లోని భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాతకడప, దేవునికడపలతోపాటు నగరానికి చెందిన భక్తులు స్వామి వెంట ఊరేగింపులో పాల్గొన్నారు. చెక్కభజన, కోలాటం కళాకారులు ఊరేగింపులో ముందుగా వెళుతూ స్వామి రాకను తెలియజెప్పారు.



హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న కడప రాయుడు

న్యూస్‌రీల్

ప్రాజెక్టుల అప్‌లోడ్‌కు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: ఇన్‌స్పైర్ మనాక్ జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఈనెల 31వ తేదీ వరకు గడువును పొడగించినట్లు జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్‌కు సంబంధించి 351 ప్రాజెక్టులు ఎంపికకాగా ఇప్పటి వరకు 150 మంది మాత్రమే తమ ప్రాజెక్టు వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారన్నారు. మిగిలిన వారు కూడా తమ ప్రాజెక్టుల వివరాలను నిర్ణయించిన తేదీ లోపల అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆ తేదీకి కూడా అప్‌లోడ్ చేయకపోతే వారి ఖాతాలకు జమచేసిన రూ. 10 వేల నగదును తిరిగి కట్టవలసి వస్తుందని, ఈ విషయాన్ని బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికారులు తెలియచేశారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నుంచి రజని సస్పెన్షన్

కడప కార్పొరేషన్: రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రసపుత్ర రజనిని సస్పెండ్ చేసినట్లు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ నియమావళిని ఉల్లంఘించినందున, ఆమె వ్యవహార శైలి సక్రమంగా లేనందున పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

చౌకబారు విమర్శలు చేయడం తగదు : ఎమ్మెల్యే రాచమల్లు



ప్రొద్దుటూరు : రాజకీయాల్లో ఉన్నపుడు హుందాగా ఉండాలని, చౌకబారు విమర్శలు తగదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రొద్దుటూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ నాయకులతో ఎంతో మంది ఫొటోలు తీసుకుంటూ ఉంటారని, అంత మాత్రాన వారి వ్యవహారంలో నాయకులకు సంబంధం ఉందని బురద చల్లడం సరికాదన్నారు. అలా అయితే బ్రీఫ్‌డ్ మీ కేసులో చంద్రబాబు, ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి పరిస్థితి ఏమిటని అన్నారు. జోడో యాత్ర చేస్తున్న రాహుల్ గాంధీతో ఎంతో మంది ఫొటోలు తీసుకుంటూ ఉంటారని, వారితో రాహుల్‌కు సంబంధం ఉందంటే ఎలా అన్నారు.

చర్యలకు సిఫారసు చేసినందునే..

రాజుపాళెంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బెంగళూరులో జరిగిన దొంగనోట్ల చెలామణి కేసులో రజని ఉన్నట్లు తెలుసుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకోవాలని పార్టీ పెద్దలకు తెలిపామన్నారు. ఈ మేరకు ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ముస్తాబు



కడప నగరంలోని పోలీస్ పరెడ్ మైదానంలో గణతంత్ర వేడుకల ముగ్గు తీర్చిదిద్దుతున్న దృశ్యం

నేడు పోలీసు పెరేడ్ మైదానంలో వేడుకలు





విద్యుత్ దీప కాంతులలో మిరుమిట్లు గొలుపుతున్న కడప నగరంలోని పలు కూడళ్లు

కడప సిటీ : 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు కడపలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ ముస్తాబైంది. ఈ మేరకు కలెక్టర్ విజయరామరాజు బుధవారం గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు ప్రజలకు తెలియజేశారు. గురువారం ఉదయం 8.30 గంటలకు కడప పోలీసు పెరేడ్‌మైదానంలో ఈ వేడుకలు నిర్వహిస్తారు. జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ విజయరామరాజు ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై 9.00 గంటలకు జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. 9.05 గంటలకు పోలీసు గౌరవ వందన స్వీకరణ, కవాతు పరిశీలన ఉంటాయి. 9.15 గంటలకు మార్చ్‌ఫాస్ట్, 9.25 గంటలకు కలెక్టర్ సందేశం, 9.55 గంటలకు ప్రగతి శకటాల ప్రదర్శన, 10.15 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులకు సత్కారం, 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11.05 గంటలకు ప్రశంసాపత్రాలు అందజేత, పతకాలు, బహుమతుల ప్రదానం, 11.40 గంటలకు స్టాల్స్ సందర్శన, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, 11.55 గంటలకు జాతీయ గీతాలాపనతో ముగింపు కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయి.

ఓటు హక్కు వజ్రాయుధం

కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : దేశంలో ఓటుహక్కు ఓ వజ్రాయుధమని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. ఓటుహక్కుతో దేశాన్ని శాసించగల శక్తి ఓటర్లందరికీ ఉందని తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ జింకా రంగ జనార్దన్ హాజరు కాగా, కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు.

ఓటరుకు ప్రత్యేక స్థానం

దేశంలో పార్లమెంటు, అసెంబ్లీలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఎంతో విలువైన ఓటరుకు ఓ ప్రత్యేక స్థానముందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటుహక్కును ప్రసాదించిందన్నారు. ప్రతి ఒక్కరూ విలువైన ఓటును నమోదు చేసుకోవాలని తెలిపారు.

- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదుకు ఎడ్యుకేట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వాలను ఎన్ను కోవడంలో ఓటర్లు ప్రధానపాత్ర పోషిస్తున్నారన్నారు.

పారదర్శకంగా ఎన్నికలు

అతి పెద్ద ప్రజాస్వామ్యంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం భారతదేశానికే చెల్లిందని వైవీయూ వీసీ జింకా రంగ జనార్దన్ అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. ఎలక్ట్రానిక్ బ్యాలెట్‌లో పాల్గొన్న వారిలో ఎవరూ నచ్చకపోతే నోటాకు ఓటు వేసే వెసులుబాటు కూడా ఈసీ కల్పించిందన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్, ఇతర అధికారులు

కొత్తగా 21 వేల మందికి ఓటుహక్కు

ప్రస్తుత ఓటర్ల జాబితాలో 28 వేల మందికి పైగా కొత్త ఓటర్లు నమోదు చేసుకోగా, అర్హత మేరకు దాదాపు 21 వేల మందికి ఓటుహక్కు లభించిందని డీఆర్వో గంగాధర్‌గౌడ్ తెలిపారు. గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు.

ఓటుహక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు

ఓటుహక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని కడప ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకుని ప్రజాస్వామ్యం బలోపేతానికి సహకరించాలన్నారు. డిగ్రీ స్టూడెంట్ సానియా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి వ్యక్తి ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా అతిథులు ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా ఓటర్లుగా నమోదైన యువతీ యువకులకు ఓటరు ఎపిక్ కార్డులను అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి ముద్ర అకాడమి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఎస్పీ కుమార్తె అవంతిక సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో కడప తహసీల్దార్ శివరామిరెడ్డి, సూపరింటెండెంట్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాల పట్ల ప్రేమ, దయ చూపాలి

ప్రతి ఒక్కరూ మూగ జీవాల పట్ల ప్రేమ, దయ చూపేలా సమాజంలో అవగాహన పెంచాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ విజయరామరాజు అధ్యక్షతన ఎస్‌పీసీఏ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో నిర్వహిస్తున్న జంతు సంక్షేమ పక్షోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జంతువుల సంరక్షణపై పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ, ఏడీలు నేతాజీ, అనుపమ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు పాలు, గుడ్లు సక్రమంగా అందాలి

కడప సిటీ: జిల్లాలోని ఆయా అంగన్వాడీ కేంద్రాలకు సకాలంలో పాలు, గుడ్లు అందేలా చూడాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బీసీ హాలులో కలెక్టర్ విజయరామరాజు, ఐసీడీఎస్ పీడీ ఎంఎస్‌రాణితో కలిసి సీడీపీఓలు, పాలు, కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే పాలను నిర్దేశిత యాప్‌ల ద్వారా కలెక్టర్ కార్యాలయం నుంచి పర్యవేక్షణ జరుగుతుందన్నారు.

పార్టీ బలోపేతంలో ఇన్‌చార్జులదే కీలకపాత్ర

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో జగనన్న సచివాలయం కన్వీనర్లు , గృహసారథులు(జేసీఎస్) జిల్లా స్థాయి, మండల ఇన్‌చార్జులదే కీలక పాత్ర అని రాష్ట్ర సమన్వయకర్త, ప్రభుత్వ సలహాదారు(ఐటీ) చల్లా మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో నిర్వహించిన జేసీఎస్ మండల ఇన్‌చార్జుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 45వేల మంది సచివాలయ కన్వీనర్లు, 904 మంది మండల ఇన్‌చార్జుల నియామకం పూర్తయ్యిందన్నారు. జేసీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్లకు, జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు మధ్య మండల ఇన్‌చార్జులు వారధిలా వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని బలపరిచి పార్టీ సమాచారాన్ని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను అతి తక్కువ వ్యవధిలో ప్రజలకు చేరవేసేందుకే ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి 50 ఇళ్లకు వలంటీర్ ఉన్నట్లే ఇప్పుడు ఇద్దరు గృహసారథులు ఉంటారని, వారిలో ఒకరు మహిళ అయి ఉండాలన్నారు. నాయకత్వ లక్షణాలు, కలుపుగోలుతనం, స్మార్ట్ ఫోన్ కలిగి ఉన్నవారిని గృహసారథులుగా నియమించాలన్నారు. నెలాఖరులోపు వీరి ఎంపికను పూర్తి చేసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో మండలానికి ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులను సంప్రదించే గృహసారథులను నియమించాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రచార కార్యక్రమాల పర్యవేక్షణ అంతా మండల ఇన్‌చార్జులే చూసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె. సురేష్ బాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు కంకణబద్ధులై పనిచేయాలని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి(కడప), ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి (బద్వేల్), కె.శ్రీనివాసులరెడ్డి (పులివెందుల), జగదీశ్వర్ రెడ్డి (కమలాపురం), నిత్యానందరెడ్డి(జమ్మలమడుగు), ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు

క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం

మైదుకూరు : కాన్పు కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా ఓ మహిళ 108 వాహనంలోనే ప్రసవించిన సంఘటన మైదుకూరు మండలంలో బుధవారం జరిగింది. మండలంలోని బసవాపురం ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల భవానికి బుధవారం తెల్లవారుజామున నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం ఇచ్చారు. ఆమెను మైదుకూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకొస్తుండగా జీవీ సత్రం సమీపంలో అంబులెన్స్‌లోనే ప్రసవం అయింది.మగ బిడ్డ జన్మించగా, తల్లీ, బిడ్డ సురక్షితంగా ఉన్నారని 108 ఈఎంటీ రవిప్రసాద్, ఐవీఎస్ కుమార్ తెలిపారు. తల్లీ బిడ్డను మైదుకూరు సీహెచ్‌సీకి చేర్చినట్టు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

కొండాపురం : రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఆటోను మంగళవారం అర్ధ రాత్రి సీజ్ చేసినట్లు కొండాపురం ఇన్‌చార్జి ఎస్‌ఐ పి. చంద్రమోహన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలకేంద్రంలోని శాంతినగర్ నుంచి బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించాం.ఈ సమయంలో వస్తున్న (ఏపీ 04–9160) ఆటోను తనిఖీ చేయగా 13 బస్తాల రేషన్ బియ్యం లభించాయి. ఆటోను స్వాధీనం చేసుని, పొట్టిపాడు గ్రామానికిచెందిన జగన్నాధం నాగన్న అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్ల చెప్పారు.

చీటింగ్ కేసు నమోదు

ఖాజీపేట : లిక్కర్ వ్యాపారంలో 10లక్షలు పెట్టుబడిగా పెట్టించి మోసగించిన సంఘటనపై ఖాజీపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు..కడపలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన కుర్రా నారాయణ ఏపీ ట్రాన్స్‌కోలో ఏడీగా పని చేస్తున్నారు. దాసరి శ్రీనివాసులు ఇతనికి బంధువు. ఖాజీపేట మండలం పాటిమీదపల్లె గ్రామంలో ఉన్న దాసరి శ్రీనివాసులు, అతని స్నేహితుడు రాజారెడ్డి, దాసరి రవిశంకర్ నాలుగేళ్ల కిందట నారాయణ వద్దకు వచ్చారు. లిక్కర్ వ్యాపారం చేద్దామని, రూ.10లక్షలు పెట్టుబడి పెట్టాలన్నారు.వారిపై నమ్మకంతో విస్కీ, డిస్ట్రిబ్యూటరీ కోసం లోకేశ్వరరెడ్డి అనే వ్యక్తి ఖాతాకు రూ.10లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు.నాలుగేళ్లవుతున్నా ఎలాంటి డిస్ట్రిబ్యూటరీ లేకపోగా డబ్బులు చెల్లించలేదు. డబ్బుకోసం పలుమార్లు లోకేశ్వరరెడ్డి, శ్రీనివాసులును అడిగినా స్పందించలేదు. దీంతో రెండు రోజుల కిందట నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈమేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శం

వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ



వైఎస్ జయమ్మ, వైఎస్ రాజారెడ్డి ఘాట్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైఎస్ విజయమ్మ, విమలమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : దివంగత వైఎస్సార్ మాతృమూర్తి వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శమని మహానేత వైఎస్సార్ సతీమణి, పులివెందుల మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. వైఎస్ జయమ్మ 17వ వర్ధంతిని బుధవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న వైఎస్ జయమ్మ, వైఎస్ రాజారెడ్డి ఘాట్‌ల వద్ద వైఎస్ విజయమ్మ, వైఎస్సార్ సోదరి విమలమ్మ, వైఎస్సార్ సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఉన్న దివంగత వైఎస్ జార్జిరెడ్డి, దివంగత వైఎస్ వివేకానందరెడ్డి, దివంగత డాక్టర్ ఇసీ గంగిరెడ్డి ఘాట్‌లతోపాటు ఇతర కుటుంబ సభ్యుల సమాధుల వద్ద పూలమాలలు వేసి వైఎస్ విజయమ్మ ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు పాస్టర్లు ఆనంద్, నరేష్ కుమార్, మృత్యుంజయల ఆధ్వర్యంలో వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వైఎస్ విజయమ్మ, వైఎస్సార్ సోదరి విమలమ్మ, వైఎస్సార్ సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్ జయమ్మ పార్కుకు చేరుకుని అక్కడున్న వైఎస్ జయమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ విజయమ్మ మాట్లాడుతూ వైఎస్ జయమ్మకు తమ కుటుంబంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. పులివెందుల ప్రాంతంలో ఎవరకి కష్టమెచ్చిన తన బిడ్డలకు కష్టం వచ్చినట్లుగా భావించేదన్నారు. వైఎస్సార్‌ను మాట తప్పని.. మడమ తిప్పని నేత గానూ, తర్వాత ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టడం వెనుక వైఎస్ జయమ్మ పాత్ర ఎంతో ఉందన్నారు. ఆమె జీవితాన్ని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం భాకరాపురంలోని జీసెస్ చారిటీస్‌లోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఎం కార్యాలయ కో.ఆర్డినేటర్ జనార్ధన్‌రెడ్డి, వేంపల్లె మాజీ జెడ్పీటీసీ డాక్టర్ బాషా, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధర రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు కోడి రమణ, ఖాదర్ బాష, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జేసీ సాయికాంత్‌వర్మ



హైస్కూల్‌ను పరిశీలిస్తున్న జేసీ సాయికాంత్ వర్మ, తిరుపాల్‌రెడ్డి, అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప రూరల్ : ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో వైద్య ఆరోగ్యశాఖలో అమలవుతున్న ఆరోగ్య సేవలు, మాతా శిశు సంరక్షణ, ఫ్యామిలీ ఫిజిషియన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆ మేరకు ఆస్పత్రులను, అందుకు అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

పుల్లారెడ్డిపేట జెడ్పీ హైస్కూల్ తనిఖీ

దువ్వూరు : మండలంలోని పుల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం జాయింట్‌కలెక్టర్ సాయికాంత్ వర్మ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో రూ.68లక్షల వ్యయంతో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయురాలు అహల్యాబాయికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో వర్షం నీరు పోయేందుకు డ్రైనేజి ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ హాస్టల్‌ను ఆధునీకరించేందుకు నిధులు కేటాయించాలని జేసీకి తెలిపారు. సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డికి ఇందుకు సంబంధించిన అంచనాలను తయారు చేయాలని సూచించారు. జేసీ మాట్లాడుతూ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఎస్‌జీఎఫ్ పోల్‌వాల్ట్‌లో రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి చరణ్‌ను, పీఈటీ శివారెడ్డిలను జేసీ అభినందించారు. ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు పరిశీలకునిగా నిత్యానందరెడ్డి



కడప కార్పొరేషన్ : జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా కడప నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి నియమితులయ్యారు. ఇటీవల పరిశీలకుల నియామకంలో జమ్మలమడుగు నియోజకవర్గానికి నంద్యాల జిల్లాకు చెందిన పామిరెడ్డిగారి పెద్ద నాగిరెడ్డి(పీపీ నాగిరెడ్డి)ని నియమించినప్పటికీ కొన్ని కారణాల వల్ల ఆ స్థానంలో నిత్యానందరెడ్డిని నియమించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన తర్వాత నిత్యానందరెడ్డి నగర అధ్యక్షుడిగా, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం కడప నగరపాలక సంస్థకు డిప్యూటీ మేయర్‌గా కొనసాగుతున్నారు. తన నియామకం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పార్టీ జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు, రాష్ట్ర కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి,జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు.

వీరబ్రహేంద్రస్వామి మఠంలో ధ్వజస్తంభం తొలగింపు



పూజలు చేస్తున్న పూర్వపు పీఠాధిపతి కుమారులు

బ్రహ్మంగారిమఠం : పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో దాదాపు 105 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో బుధవారం మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వరాచారి సిబ్బందితో తొలగించారు. ఈసందర్భంగా శంకర్‌బాలాజీ మాట్లాడుతూ పూర్వపు పీఠాధిపతి కుమారుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభం తొలగింపు కార్యక్రమం చేపట్టినట్ల చెప్పారు.ఈ విషయంలో భక్తులు ఎలాంటి అపోహలకు గురికావద్దన్నారు. నెలలోగా భక్తుల సహకారంతో కొత్తది ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎంపీపీ సి.వీర నారాయణరెడ్డి ధ్వజస్తంభాన్ని పరిశీలించారు.

రైలుపట్టాలపై క్లిప్పల తొలగింపు



దాల్మియా కర్మాగారానికి గూడ్స్ రైలు వచ్చేట్రాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : రైలు పట్టాలకు ఉన్న క్లిప్పులను గుర్తు తెలియని దుండగులు తొలగించి పక్కన పడేసిన సంఘటన మైలవరం మండలంలో చోటుచేసుకొంది. తలమంచిపట్నం ఎస్‌ఐ గొపినాథ్‌రెడ్డి కథనం మేరకు.. దాల్మియా సిమెంట్ కర్మాగారానికి వచ్చే గూడ్స్‌రైలు కోసం జమ్మలమడుగు నుంచి దాల్మియా కర్మాగారం వరకు అధికారులు రైల్వే ట్రాక్‌ను ఏర్పాటు చేశారు.ఈ నెల 22వ తేదీన గూడ్స్ రైలు వచ్చే గంట ముందు రైల్వే ట్రాక్‌ను సిబ్బంది పరిశీలించారు. కాగా చిన్న కొమెర్ల, నవాబుపేట గ్రామ శివార్లలో రైల్వే ట్రాక్‌కు ఏర్పాటుచేసిన 16 క్లిప్పులను తొలగించి ఉండటాన్ని గమనించారు. వెంటనే దాల్మియా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారులకు తెలియజేసి గూడ్స్ రైలును మధ్యలోనే ఆపేశారు. అనంతరం రైల్వే సిబ్బంది క్లిప్పులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు 22న దాల్మియా సిమెంట్ కార్యాలయ హెడ్ రామచందర్ తలమంచిపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అయితే కోర్టు నుంచి అనుమతి తీసుకుని, బుధవారం కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ గొపినాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

కడప అర్బన్ : డబ్బుల చెల్లింపుకు ఇచ్చిన బ్యాంకు చెక్ బౌన్స్ కావడంతో చేసిన నేరం రుజువు కావడంతో ఆర్. రహిమాన్ అనే వ్యక్తికి ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తూ కడపలోని జిల్లా కోర్టులో రెండవ అదనపు మెజిస్ట్రేట్ షేక్ రియాజ్ బుధవారం తీర్పునిచ్చారు. రఘుశ్రీరామ్ చిట్స్ సంస్థలో చిట్టీకి సంబంధించి మొత్తం రూ. 4.50 లక్షలు రహిమాన్ బాకీ ఉన్నట్లు కేసులో పేర్కొన్నారు. ఆ మొత్తం చెల్లించేందుకు రహిమాన్ తన ఖాతాతో ఉన్న బ్యాంక్ చెక్కును 2019 జనవరి 9న సంస్థకు ఇచ్చారు. ఆ చెక్కును బ్యాంక్‌కు, సంస్థ వారు జమచేస్తే డబ్బు అకౌంట్‌లో లేదు. దీంతో సంస్థ వారు తమ న్యాయవాది రంగనాయకులు ద్వారా కోర్టులో కేసును దాఖలు చేశారు.నేరం రుజువు కావడంతో జైలు శిక్ష , చెక్కు మొత్తం రూ.4.50 లక్షలు పరిహారంగా చెల్లించాలని జడ్జి తీర్పునిచ్చారు.

కడప సెంట్రల్ జైలు నుంచి ఒక్క ఖైదీ విడుదలకు అవకాశం

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కారాగారాల నుంచి ఆయా కారాగార అధికారులు ప్రభుత్వానికి తమ జైళ్లలో ఐదేళ్లలోపు శిక్షను అనుభవిస్తున్న ఖైదీల విడుదలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించారు. కడప కేంద్రకారాగారం నుంచి జీఓ ఎం.ఎస్. నంబర్. 107 తేది 22/07/2022 ప్రకారం అర్హులైన వారిగా ముగ్గురి పేర్లను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఐతే వీరిలో ఇద్దరిని రాష్ట్ర కమిటీ రిజెక్ట్ చేసింది. ఒకరు మాత్రమే విడుదలకు అర్హులని తేల్చారు. కానీ ఆ ఒక్కరికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర కారాగార శాఖ నుంచి కడప కేంద్రకారాగారానికి రావాల్సి ఉందని సూపరింటెండెంట్ ప్రకాష్ తెలియజేశారు.

అగ్ని ప్రమాదాలపై ఆపద మిత్రలకు శిక్షణ



ఆపద మిత్రలకు నిర్వహిస్తున్న ప్రయోగాత్మక శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్ : అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ప్రజలను ఎలా కాపాడాలో బుధవారం ఆపద మిత్రలకు జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీ కేంద్రం వద్ద ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. అగ్నిమాపక శాఖ లీడింగ్ ఫైర్‌మెన్ కేవీ సుబ్బయ్య, ఫైర్‌మెన్ హరికృష్ణ శిక్షణ ఇచ్చారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఎక్కువగా పొగ వస్తుందని తెలిపారు. అలాంటి సమయాల్లో ప్రమాదం నుంచి బయటపడేందుకు సాహసంతోపాటు సమయస్ఫూర్తి ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. మిద్దెపై నుంచి రాలేని పక్షంలో తాడు, కట్టెల సాయంతో చిన్న నిచ్చెన వేసుకుని ఎలా బయటపడాలో ఆపద మిత్రలకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ వెంకటేశు ఫ్యాకల్టీ ఏవీ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న షూటింగ్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : శాప్ లీగ్ పోటీల్లో భాగంగా ఈనెల 27వ తేదీన వేంపల్లి పట్టణంలోని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 29న బాపట్లలో నిర్వహించే శాప్ లీగ్ రాష్ట్రస్థాయి అండర్–17 షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. 2006 జనవరి 1 తర్వాత పుట్టినవారు ఈ ఎంపికలకు అర్హులని తెలిపారు.

కడపలో పట్టపగలు చోరీ

రూ.2..40 లక్షల విలువైన బంగారు ఆభరణాల అపహరణ

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేణుగోపాలస్వామి గుడి సమీపంలో బుధవారం ఓ ఇంటిలో పట్ట పగలు చోరీ జరిగింది. బాధితురాలు ఏ. లక్ష్మి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నగరం నకాష్ వీధిలో వెంకటసుబ్బయ్య, అతని భార్య లక్ష్మి ఓ ఇంటిలో మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నారు. బాధితురాలు ఇంటికి తాళం వేసి, పక్కవీధిలోకి వెళ్లి కొంతసేపటికి ఇంటికి వచ్చింది. అప్పటికే ఓ గుర్తు తెలియని యువకుడు తమ ఇంటినుంచి కిందకు హడావుడిగా దిగుతుండగా, ఎవరు నువ్వు అని ప్రశ్నించింది. ఎలాంటి సమాధానం చెప్పకుండా అతను పరారయ్యాడు. తలుపునకు ఉన్న తాళం పగులగొట్టి ఉంది.. లోపల వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా తెరిచి ఉంది. నిందితుడు బీరువాలోని రూ. 2.40 లక్షల విలువైన 58 గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకుని పరారయ్యాడు. బాధితురాలి సమాచారంతో కడప టూటౌన్ సీఐ సయ్యద్‌హాసం సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామనీ సీఐ పేర్కొన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడాపోటీలు



హ్యాండ్‌బాల్ మహిళల విభాగం విజేతలు



హ్యాండ్‌బాల్ పురుషుల విభాగం విజేతలు

తొలిరోజు నాలుగు క్రీడాంశాల్లో పోటీల నిర్వహణ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీల్లో భాగంగా బుధవారం కడప నగరంలోని మైదానంలో హ్యాండ్‌బాల్, హాకీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, శాప్ డైరెక్టర్ మైఖేల్ డానియల్ ప్రదీప్‌కుమార్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు దోహదపడతాయన్నారు. కడప డీఎస్ఏ మైదానాన్ని రూ.10 కోట్లతో ఆధునీకరించేందుకు ప్రతిపాదనలు పంపారని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. జిల్లా కలెక్టర్, కమిషనర్‌ల సహకారంతో హ్యాండ్ బాల్, టెన్నిస్, స్కేటింగ్, వాలీబాల్ క్రీడాంశాలకు సంబంధించి టర్ఫ్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ హాకీ కోచ్ ఆకుల రమేష్‌బాబు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి. లక్ష్మణ్, రాజశేఖర్, కోచ్‌లు అబ్దుల్ మునాఫ్, కల్యాణ్‌కుమార్, శ్రీనివాసరాజు, నూర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..(విన్నర్స్, రన్నర్స్)

హాకీ పురుషులు : కడప, రాయచోటి
హాకీ మహిళలు : కడప, రాయచోటి
హ్యాండ్‌బాల్ పురుషులు : కడప, కమలాపురం
హ్యాండ్‌బాల్ మహిళలు : జమ్మలమడుగు, కేఓఆర్ఎం, కడప
బాల్ బ్యాడ్మింటన్ : మైదుకూరు, కడప.

పోలీసుల స్పెషల్ డ్రైవ్

కడప అర్బన్ : హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం వల్ల విలువైన ప్రాణాలను సురక్షితంగా ఉంచుకోవచ్చన్నారు. బుధవారం జిల్లాలో పోలీసు అధికారులు నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో మొత్తం 175 కేసులు నమోదు చేశారు. హెల్మెట్ లేని కేసులు 159, సీటు బెల్ట్ ధరించని కేసులు 16 నమోదయ్యాయన్నారు.

ఎక్సలేటర్ తొక్కడం వల్లే రోడ్డు ప్రమాదం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో ఈ నెల 20న రాత్రి 2 గంటల సమయంలో ముగ్గురు మృతి చెందారు. నిద్రమత్తు వల్లనే ప్రమాదం జరిగిందని డీఎస్పీ వంశీధర్ గౌడ్ పేర్కొన్నారు. చాపాడులో బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని, ప్రమాదానికి కారణమైన టెంపో వాహనాన్ని రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులతో కలసి డీఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెంపో వ్యాను నడిపే డ్రైవర్ నిద్రమత్తులో డ్రైవర్ బ్రేక్ బదులుగా ఎక్స్‌లేటర్ తొక్కినట్లు అర్థం అవుతోందని దీని కారణంగానే రోడ్డు ప్రమాదం జరిగినట్లు డీఎస్పీ తెలిపారు.

అమీన్‌పీర్ దర్గాలో టీవీ నటి ప్రార్థనలు



కడప పెద్దదర్గాలో ఐశ్వర్య

కడప కల్చరల్ : ప్రముఖ టీవీ హాస్యనటి బజర్దస్త్ ఫేం ఐశ్వర్య బుధవారం కడపలోని అమీన్‌పీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా దర్శన నిమిత్తం వచ్చిన ఆమెకు దర్గా ప్రతినిధులు గురువుల దర్శనం చేయించారు. తొలుత ఆమె దర్గాలోని హజరత్ పీరుల్లా మాలిక్ మజార్‌ను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిచారు. అనంతరం దర్గా ఆవరణలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గా ప్రతినిధులు ఆమెకు దర్గా గురువుల చరిత్ర, విశిష్టతలను తెలియజేశారు.

ఆర్టీసీ టిక్కెట్‌తో శ్రీశైలంలో శీఘ్ర దర్శనం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ టిక్కెట్‌తో పాటు అదనంగా నగదు చెల్లిస్తే ఫిబ్రవరి 1వ తేదినుంచి శీఘ్ర దర్శనానికి ఆలయ అధికారులు అనుమతిస్తారని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కడప నుంచి ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీశైలానికి బస్సులు బయలుదేరుతాయన్నారు. స్వామి వారి స్పర్శ దర్శనానికి రూ. 500 టిక్కెట్ తీసుకున్న వారు కేటాయించిన సమయంలోగా ఉదయం 7.30, మధ్యాహ్నం 12.30, రాత్రి 9.00 గంటల్లోగా దర్శనానికి వెళ్లవచ్చన్నారు. అతి శీఘ్ర దర్శనానికి రూ. 300, శీఘ్ర దర్శనానికి టిక్కెట్‌కు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే రూ. 300, రూ. 150 టిక్కెట్లను తీసుకున్న వారు టిక్కెట్‌పై 24 గంటల్లోగా దర్శనానికి వెళ్లాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

రియల్ మోసగాడు అరెస్ట్

బి కొత్తకోట(అన్నమయ్య జిల్లా) : ఇళ్ల స్థలాలు విక్రయిస్తానని నమ్మించి మోసం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామమోహన్ బుధవారం తెలిపారు.వివరాలు.. మదనపల్లె కొత్త ఇండ్లకు చెందిన సయ్యద్ మునాఫ్ 2012లో బి కొత్త కోటలో 45 ప్లాట్‌లను విక్రయానికి ఉంచాడు. అయితే ఉన్న ప్లాట్లకు మించి స్థానికులకు 75 ప్లాట్లను విక్రయించాడు. 45 మాత్రమే అక్కడ ఉండడంతో మిగిలిన వారికి ప్లాట్లను చూపించలేదు. లేని ప్లాట్లు ఉన్నట్లు నమ్మించి స్థానికులను మోసం చేశాడు. ఇది కాక ఇళ్లస్థలాలు ఇస్తానంటూ నమ్మించి డబ్బు వసూలు చేశారు. వీరిలో మండలంలోని బడికాయలపల్లెకు చెందిన ఆదినారాయణ, తానుకొన్న ప్లాటు చూపించాలని మునాఫ్‌ను కోరగా చూపించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడు. మోసగాడిపై కేసు నమోదు చేయాలని కోర్టు పోలీసులను ఆదేశించింది. దీనిపై గత డిసెంబరు 27న కేసు నమోదు చేసి విచారించామని ఎస్‌ఐ తెలిపారు.

అరటి పంట దగ్ధం



కాలిపోయిన అరటి తోట

సింహాద్రిపురం : మండల పరిధిలోని రావులకొలను గ్రామంలో బుధవారం పలి అనే రైతుకు చెందిన 5ఎకరాల అరటి పంట కాలిపోయింది. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తనకున్న 5ఎకరాలలో అరటి పంట సాగు చేశానని.. ప్రస్తుతం మొదటి దిగుబడి అయిపోయి... రెండోసారి దిగుబడి వచ్చే సమయంలో పక్క పొలం రైతు భూమిరెడ్డి పెద్ద ఓబుళరెడ్డి తన పొలంలో గడ్డికి నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు వచ్చి అరటి పంటకు అంటుకుని అరటి గెలలు డ్రిప్ పరికరాలు, పైపులు కాలిపోయాయన్నారు. పులివెందుల అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.